



యం. యస్. పతి

ఆరోజు ఆదివారం కాబట్టి మామ ఇంట్లోనే ఉన్నడు. అప్పుడే పేపరు పిలగాడు తెచ్చిన "ఆంధ్ర పత్రిక" చదువుకుంట వరండల కూసున్నడు.

నేనుమామకుకొంచెం దూరంగున్న ఒకకుర్చీల కూసొని నాజిందగీనిగురించి సోచాయించుతున్న.

ఇంతట్లనే ఒకాయిన కంపోండుగేటు తీసుకుని లోపలికొచ్చిండు. లోపటికొస్తూనే మామను చూసి "నమస్కారమండీ, రమణయ్యగారూ!" అని అన్నడు. మామ పేపరు మీదున్న నజర్ (దృష్టి) ఆయన దిదికి తిప్పి "హో హో, మీరా! రండి రండి," అంటూ వరండలకు ఆహ్వానించిండు. ఆయి నొచ్చి మామపక్కకున్న కుర్చీల కూసున్నడు.

"ఏంపనిమీద చ్చింద్రు?" అడిగిండు మామ.

ఆయన జర్రసేపు నీళ్లమింగినంక మామదిక్కు చూస్తూ ఇట్లన్నడు: "నేనుహైద్రాబాద్‌సిటీకి రావడం ఇదే మొదటిసారి. ఇక్కడ నాకు బంధువులు గానీ, తెలిసినవాళ్లుగానీ ఎవరూలేరు. ప్రస్తుతం హోటల్లో ఉంటున్నాను ......" అని కొంచెం సేపాగి మళ్ల శురువుచేసిండు. ...... "మీరు ఈసిటీతో చాలా పరిచయమున్నవారు కాబట్టి కాస్త శ్రమనుకోకుండా మీరు మన ఆఫీసుప్రాంతంలో ఏ రెండు రూముల పోర్షను అద్దెకు చూపిస్తే ఫామిలీని తీసుకురావాలనుకుంటున్నాను."

మామ జర్రసేపు సోచాయించి "ఇప్పటికైతే ఖాళీ లెక్కడున్నవో నాకు తెలువదు. కాని రేపటి వరకు తెలుసుకొని చెప్త" నని అన్నడు. వచ్చినాయన పరేషాన్నడు.

ఇంక జర్రసేపటికిదాక వాళ్ల ఆఫీసుమాటలు మాట్లాడుకున్నంక ఆయన వెళ్లిపోయిండు.

ఆయన పోంగనే మామ నాదిక్కుతిరిగి "పుల్లయ్యా!" అని పిలిచిండు.

"ఏంది, మామా!" అన్న.

"నీకు హైద్రాబాద్ సిటీతోటి మంచి ములాఖాతున్నదిగదా ......"

"ఊఁ!"

"మరయితే ఒక పని చేసిపెడ్తవా?"

"తెలిసింది తెయ్యి అదేందనో"

"ఏందనో చెప్పు చూస్త."

"అదే ఇప్పుడొచ్చినాయినకు ఒక ఇల్లు కిరాయికి దూడుక రమ్మంటవ్"!

"అంతే! చెప్పకముందే తెలుసుకున్నవ్. పిల్లగాండ్లంటే ఇట్లుకారుండాలె." మామ నన్ను ఉబ్బిస్తుండని తెలుసుకున్న.

"ఇప్పు డొచ్చినాయిన పాపం హొత్తి అమాయకుడు. మొన్ననే కొత్తగా బదిలై వొచ్చిండు. ఆయనకు ఇల్లు కిరాయికి చూపిపెడ్తే నీమదత్ మరిచిపోడు."

మామ చెప్పక చెప్పక చెప్పిన ఈ చిన్నపని నా కో లెఖ్ఖా, అనుకున్న. "సరే మామ! పొద్మకేవరకు ఏడెనిమిది ఇండ్లు చూసొస్త" అని అన్న.

"అయితే ఎప్పుడు పోతవు మరి?"

"ఇప్పుడే పోత."

"అయితే జర్రంత అన్నం తిని పో. ఆకలైతది"

"ఇల్లు చూసొచ్చేటంతవరకు మంచినీళ్లుకూడ తాగ" అని అన్ననేను పట్టిన పట్టు విడవనన్నట్టు.

"శబ్బాష్! పట్టుపడ్తె ఇట్ల పట్టాలె" అని మెచ్చుకున్నడు. నాకు చాన ఖుషి అయింది.

"మరి ఇల్లెటుదిక్కు చూడాలె?" అని అడిగిన.

"అటు మా ఆఫీసుదిక్కే చూడు. మోజంజాయి మార్కెట్టూ, నాంపల్లి, గోశామహల్, ఉస్మాన్ గంజ్‌ల దిక్కు చూస్తె చాలు". అన్నడు.

నేను సరేనని మామసైకిలు తీసుకొని బయల్దేరిన.

* * *

నా సైకిలు (అంటే మామది) ఎసోంటి ఒడిదుడుకులు లేకుంట, ఎవ్వరికి టక్కరియ్యకుంట ఎన్నో హజార్ల మనుష్యులనూ, దుకాణాలనూ దాటుకుంటొచ్చి గోశామహల్ చేరుకుంది. అడ ఎడమ దిక్కున్న పోలీస్‌థాన పక్కకున్న సందిలకెలి నా సైకిల్ను పోనిచ్చి కొంతదూరం పోయినంక సైకిల్ దిగిన. అక్కడినుంచి ఒక్కొక్క ఇంటిని ఉశారుగ పరీక్ష చేసుకుంట పోయిన.

ఆ బస్తీలున్న ఇండ్లన్ని ఆకాశాన్ని అంటుకుంటున్న యా అన్నంత ఎత్తుకట్టి దగ్గరదగ్గరున్నై. ఒక బంగ్లగోడ కంటుకొనే ఉంకోటుంది కాని రెండింటి నడుమ సందంటు లేదు. గింతంత జాగకూడ హొత్తిగ వదిలిపెట్టక బంగ్లలమీద బంగ్లలు కట్టింద్రు బోలెడంత కిరాయిపైస్లు సంపాయించాలని. అన్నిబంగ్లలూ,అన్ని కమరలున్నగాని ఏ ఒక్కటికూడ ఖాలీ కున్నట్టు కనిపించ లేదు. ఏ ఇంట్లచూసినగాని గంపెడుమంది పోరగాండ్లు. ఉన్న బెత్తెడంత కమ్రలల్లనే గంపల కొద్ది సామాన్లు ఇరికిచ్చి పెట్టుకున్నరు. గసోంటిచాల్లీచాలని కమ్రలల్ల పెండ్లాం, మొగడూ, వాళ్ల, పిలగాండ్లు ఎట్ల పంటరో నాకు తెలువలేదు.

అయితే ఈ గంజ్‌ల ఇల్లు కిరాయికి దొరుకుడు చాన ముష్కిలనుకొని గోశామహల్‌స్టేడియం వెనుకదిక్కున్న మంగల్ ఘాటుకు పోయిన. అక్కడనుత్రం ఉండేద్పనయా! అదిగోశామహల్ తాతున్నట్టుంది అనుకుంటూ పోతుంటే ఒకచోట ఇంటిముందట "ఇల్లు కిరాయికి" అన్న బోర్డు కనిపించింది. అది చూడంగనేమాప్పూరిదొర మామిడి తోట చూసిన ట్టనిపించింది. నేను సైకిలు దిగిన. కాని ఎవ్వల్నడుగాల్నో తెలువక అక్కడనిలబడి చూస్తున్నంతల ఆ కమ్ర పక్కకు జర్రదూరాన ఉన్న దర్వాజలకెలి ఒకాయిన బైటకొచ్చిండు. అట్లొస్తూనే నన్నుచూసి "ఏంకావాలె?" అని అడిగిండు.

"ఈ కమ్ర కిరాయికిచ్చేదా?" అనడిగిన.

"ఆ, కిరాయికిచ్చేదే. మీకు కావాల్నా?" అని అన్నడాయన.

"మా మామకు కావాలెనట! రెండురూముల పోర్షన్" అని అన్న.

"దీంట్ల రెండు రూములున్నై"

"అయితే జర్ర చూపిస్తరా?"

"సరే, తాళంచేతులు తెస్తనుండు" అనుకుంటూ ఇంట్లకుపోయిండు.

తాళంచేతులగుత్తి తీసుకొచ్చి తాళం తీసిండు. ఇద్దరం లోపటికి పోయినం. సున్నంలేని గోడలోట్టీ, తుక్కుతుక్కు పలిగిన శాబాద్ రాళ్లతోటి, గాడిదల కొట్టి తీరున్న ఆ పోర్షన్ ముందటిగది దేడ్ (ఒకటి న్నర) గజ్ వెడల్పూ ఆడై (రెండున్నర) గజ్ పొడుగూ; రెండోదిదో గజ్ వెడల్పూ,అడైగజ్ పొడుగూ ఉన్నై. నల్ల (నీటిపంపు) లేదు. పాయఖానలేదు. కరంటు లేదు.

"మరి నల్ల, పాయఖాన, కరంటు లెవ్వుగదా!" అన్న.

"నల్ల, పాయఖాన మా యింట్లది వాడుకోవాలె. కరంటుమాత్రం లేదు."

"దీనికి కిరాయెంత?"



"ముప్పై రూపాయలు"

చంపినవ్‌రా నాయినా! ముప్పై రూపాయలే!! అడ్డం పొడుగు కలుపుతే నాలుగు గజాలు లేదుగాని ముప్పై రూపాయలట ! ! !

"సరే, నేను పొద్మికి మా మామను తీసుకొనొస్త. ఆయనతోటి మాట్లాడుకోండ్రి," అని అంటే ఆయిన సరేనన్నడు.

ఇక ఆసంది విడిచిపెట్టి ఇంకోసందిలకు నా సైకిల్‌ను పోనిచ్చిన. ఆసందిల తిరుగంగ తిరుగంగ ఒకచోట "ఇల్లు కిరాయికి" బోర్డు కనిపించింది. ఆ ఇంటి కాంపోండుకు అంటివున్న ఒక సైకిల్ షెక్సి ఆయినను ఆబోర్డునుగురించి అడుగుతే గేటు తీసుకొని లోపటికిపోతే ఎడమచెయ్యి దిక్కుఇ ఇంట్లడుగుతే తెలుస్తదన్నడు. నేను నా సైకిల్‌ను ఆయన దుకాణం ముందట్నే పెట్టి గేటు తీసుకొని లోపటికి పోయిన. ఒకాయిన ఒక పిలగానికి పతంగి (గాలిపటం) ఎట్లెగిరెయ్యాల్నో నేర్పుతున్నడు. ఆయినను ఇల్లు కిరాయి గురించి అడిగిన. అప్పు డాయిన పతంగిదారం ఆపిలగానికిచ్చి నన్ను తనతోటి తీసుకపొయ్యి కిరాయికిచ్చే క్రమలు చూపిచ్చిండు. ఆ క్రమ రేకుల షెడ్డు కిందిది. వాళ్ల కాంపోండుగోడనే ఎత్తు కట్టి అగోడకు రేకులషెడ్డేసింద్రు. అసలది పశువులశాలకోసం కట్టినట్టుంది. కాని కుక్కను కొడితే రూపాయలు రాలేటట్టున్న ఈ జమానల పశువులకని గింతపెద్ద షెడ్డెందుకు వదిలిపెట్టాలె ననుకొని పావుభాగం చొప్పున అడ్డం గోడకట్టి నాలుగు క్రమలు చేసింద్రు. ఒకదాన్లనేమో పశువులున్నై. మిగిలిన మూడింటిని కిరాయికిస్తమని బోర్డు పెట్టింద్రు. ఆమూడింటికి ముందట గోడేలేదు. తలుపు లసలే లేవు. రాఫ్టర్ బద్దల్తోటి ముందట గోడ తిరుగ కొట్టింద్రు. తలుపుకూడా ఆబద్దల్దే. ఆ అడ్డం, నిలువు కొట్టిన బద్దల సందులకెలి కుక్కలు, పిల్లులు ఏసొంటి ఖత్రా (ప్రమాదం) లేకుంట కావొచ్చు, పోవొచ్చు. సడిబజార్ల సందుకుంటే ఏకెంత చలుంటదో ఆ రూములల్ల సందుకుంటే అంతే ఉంటంది. ఎండకాలమొస్తే మీద రేకులన్నైకాబట్టి ఎట్లుంటదో మీరే సోంచాయించి కోండ్రి.

"దీనికి కిరాయెంత?" అనడిగిన

"ఆ, ఎంతలే చాల తక్కువ. ముప్పై రూపాయలు."

ముప్పై రూపాయలే ఈ సీటే కిరాయి తోల్లకు తక్కువలు తక్కువ ఉన్నట్లుంది. నాలుగు గోడలుంటే చాలు, అది క్రమకానియ్యి కాకపోనియ్యి ముప్పై రూపాయలు నికాలో అనేటట్లున్నరు అనుకున్న.

ఆయనకు నేను క్రమ పసండ్ చేసిన ట్లనిపించిందో ఏమో కాని నాతోటి "మరి మీరెప్పుడొస్తరు ?" అని అన్నడు.

"పొద్మికి మా మామను తీసుకొస్త. ఆయనొచ్చి ఖరారు చేస్తడు"


"ఆ, చెప్పుడు మరిచిపోయిన. కరంటు రెండు రూపాయలు బిల్లు మీరే కట్టుకోవాలె. పాయఖానకు మనిషొక్కంటికి చారాన ఇస్తెచాలు."

ఇంకేమన్న ఉన్నయా. వెనుకా ముందట, అని అందా మనుకొన్న ఆయిన వాల్ చూసి. కాని అసలేదు పోనీ పాపమని.

"సరే, అవ్వన్ని నేను మామతోటిచెప్పి పొద్మికి తీసుకొస్త" ననుకుంటూ మల్ల సైకిలెక్కిన.

ఇక గోశామహల్, మంగల్ ఘాట్ వదిలిపెట్టి మొజ్జంజాయి మార్కెటు చేరుకున్న. ఈ మార్కెటు తాన తురుకరాజా జమానల కట్టించిన బంగ్లలు బోలెడున్నై. "మేము మునలోల్లమైనం రేపో, ఎల్లుండో గుటుక్కుమంటం. అయినా మేము బతికున్నంతకాలం మా ఖదర్‌ను పోనియ్యం" అని అంటున్నట్లున్నై ఆ బంగ్లలు. ఆబంగ్లలల్ల చాలావాటికి కాంపోండులున్నై. కాంపోండుగోడల నంటుకునే మురికికాలువలు పోతున్నై. వాటిమీద కప్పు లేదు. ఆ కాలువలల్ల మురికినీల్లకు బదులు పాయఖాన పారుతుంది.రడగబ్బువాసన! మరి ఆబంగ్లలల్ల

—41 వ పేజీ చూడండి



# ఇల్లు కిరాయికి

27-వ పేజీ తరువాయి

ఉండెటోళ్లు ఎట్లుంటరో మరి. వాళ్లు అవాననకు అలవాటుపడ్డట్లున్నరు అందుకని వాళ్లకు గబ్బు వాసనున్నా ఏమనిపించదు.

మోజంజాయి మార్కెట్ల ఎక్కువమంది తుర కోళ్ల బంగ్లలున్నై. నేను ఒక్కొక్క బంగ్ల ఎత్మినాన్ (నిదానం)తోటి చూసుకుంటపో పోవుడు మొదలుపెట్టిన ఎండ్లనన్న ఖాలి కమ్రలు కనిపిస్తయోనని.

ఇట్ల చూసుకుంట పోంగ ఒక బంగ్లలోపట కొన్ని కమ్రలు తాళాలేసి కనిపించిన్నై. అవి కిరాయి కిస్తరో ఏమోననిపించింది. అందుకని సైకిల్ గేట్ కాడుంచి లోపటికి పోయిన. మల్ల చటుక్కున నేనున్నది హైద్రాబాద్ పట్నంఅని యాదిచేసుకొని బయిటికురికొచ్చి నా సైకిల్ తీసుకొని లోపటికి పోయిన. కాని బైట ఎవ్వరు లేరు. ఎవ్వరన్నొస్తరో నని చూస్తుండంగనే వోయాబై యేండ్ల ముస లమ్మ బైటికొచ్చింది. ఆమె నన్ను చూడంగనే ఒక పెద్దదయ్యాన్ని చూసినట్టు భయపడి జర్వ బుర్కా మొఖంమీదికి కప్పుకొని లోపటి కురికింది. ఈ బుర్కాసిస్టంతోటి ఈ స్త్రీలకు అజాద్ (స్వతంత్రం) లేకుంట పోతుంది. వాళ్లకు రిక్షలల్ల, పొయ్యేటప్పుడు బుర్ఖలే! సీన్మలకు పొయ్యేటప్పుడు బుర్ఖలే! పెండ్లిల్లకు పొయ్యే టప్పుడు బుర్కాలే! ఇస్కూల్లకు పొయ్యే కొంద రాడిపిల్లలకుకూడ బుర్కాలే!

ఇట్లనేను బుర్ఖలగురించి పోంచాయించు, తుండంగనే ఒక కలియుగ రాక్షసుడు బైటికొచ్చిండు జీడికాయరంగుతోటి, చింతమొద్దు శరీరంతోటి. దొంగసన్నాసుల గడ్డంతోటి, బుడ్డర్ఖాన్ (జోకర్) తురుకటోపీతోటి ఉండి కండ్లనిండ సుర్మా (కాటుక) పూసుకొని, ఎర్రషేర్వాని తొడుక్కున్న సాయెబు బైటికొచ్చేవారకు నేను పరేశాన్లై పోయిన.

"క్యారే భే! అందర్ క్యోఁ ఆయే!"

నేను తడబడుకుంట అన్న: "ఇల్లు కిరాయికి..."

"ఇల్లుకిరాయి కని చెప్పకుంటొచ్చి ఆడోల్లను చూస్తున్నావ్‌రా! మీ రాజ్యమొస్తే మా ఖదర్ పోయిం దనుకున్నావ్‌రా! ఆగు నీపెండ్లిచేస్త" అని తురకంల తిట్టుకుంట నాదగ్గరికొచ్చి నా రెండు చెవ్వులు మెలి పెట్టి నా చెంపలమీద చెడేల్, చెడేల్ మని కొట్టిండు.

"ఏయ్, ఇల్లు కిరాయికియ్యకపోతే నోటితోటి చెప్పాలెగాని కొట్టుడెందుకు! నీ అయ్య సొమ్మేమన్న నాకు పెట్టినవా?" అని అన్న కోపంతోటి. నాకు హైద్రాబాద్‌చాల్ జర్ర తెలిసిందికాబట్టి వాడు కొట్టంగనే అట్ల జోష్ పుట్టుకొచ్చింది.

"అట్లనా. నీకు అయ్యసొమ్ము కావాల్నా? ఇస్తదా," అని తురకంల అనుకుంట నాసైకిల్ నాచేతులకేలి గుంజిపారేసి యాభై అయిదు శేర్లున్న నన్ను వాని రెండుచేతులతోటి అమాంతం మీదికి లేపి, అట్లనే తీసుకపోయి ఎడమచెయ్యి దిక్కు పూలచెట్ల నడుమున్న ఒకనీళ్ల హౌజుల నన్ను ఎత్తేసిండు. ఆనీల్లల్ల దబేల్‌మని పడ్డప్పుడు నా తల హౌజుగోడకు క్రొట్టుకొని నెత్తురుకారుడు షురువైలది. బట్టలన్ని ముద్దయిపోయిన్నై. నేను కారుతున్న నెత్తురును తుడుచుకుంటు ఆ నీలలల్ల కేలి బైటికి రావాలని నిలబడ పోయిన. కాని జర్రున కాల్లుజారి దబేల్‌మని మల్ల నీల్లల్లపడ్డ. ఎందుకంటె హౌజు అడుగున బాగ పాకుడు పట్టింది. అందుకనే కాల్లు జారిన్నై. నేను మల్లనిలవడబోయి మల్లపడ్డ. అట్ల నాలుగైదు సార్లు కోశిష్ చేసినగాని ఫాయిదలేకుంట పోయింది. అట్ల నేను లేస్తూ, పడుతూ నీల్లల్ల నరకయాతన పడుతుంటే ఆ చింతమొద్దుగాడూ, ఇంకిద్దరు పోరగాండ్లూ, బంగ్లమీదికేలి నలుగురైదుగురు బుర్కాలోల్లు కిచకిచ నవ్వుతున్నరు.

ఎట్లైతేంది, కోశిశ్ చేసీచేసీ ఆనీళ్ల హౌజుల కేలి బైటికెల్లిన.

అప్పుడా క్రూర తురుకోడు మల్ల నాతానికొచ్చి "ఇంకోసారి ఇటురాకు. తెలిసిందా మా తడాఖా!" అని తురుకంల బెదిరించుకుంటు నాసైకిల్‌ను కాంపోండు ఔతలికి బాలేసినట్టు విసిరేసిండు. నేను నెత్తురుకారుతున్న నొసలుతోటి, నీళ్ళు కారుతున్న బట్టలతోటి, చీమిడికార తున్న ముక్కుతోటి (నీల్లల్ల మునుగుతే సర్దిచేసింది) బైటికొచ్చేవారకు నా సైకిలు "పుల్లయ్యా, నీతో టొస్తే నాకు తన్నులు తప్పుతలెవ్వు. ఇన్ని రోజులు మామతోటి మర్యాదగ బతికినదాన్ని" అని ఏడ్చుడు శురువు చేసింది. అప్పుడు దానికి చాక్లెట్లు కొనిస్త, ఏడ్వకని ఊకోబెట్టి, తడిసిన నా బట్టలను పిండుకొని, వంకరతిరిగిన సైకిల్‌గాని మెడను సక్కగచేసిన.

ఇక చాలురా నాయినా, ఇల్లుకిరాయికి పోతే వీపు సాఫయింది. ఈ ఇల్లుకిరాయిగొడువవద్దు, పెంటబొద్దవద్దు. చాతనైతే మామే తనదోస్తు లకు ఇల్లు కిరాయికి చూపెడ్తడు. నాకెందుకీ తక్లీఫ్ అనుకుంట ఇంటిదారిపట్టిన.

నేను జర్ర దూరం పోంగనే వెనుకకేలి "ఎటోయ్, పుల్లయ్యా" అన్నపిలువు వినొచ్చింది.

నన్నెవ్రలా ఈ సిటీల పిలిచేది అనుకుంటు వెనుకకుతిరిగి చూడంగనే మా యింటిపక్కాయన కనిపించిండు.

యాడికి వోయినవ్?" అడిగిండు నన్ను.

"మా మావ వాళ్ల దోస్తుకు ఇల్లు కిరాయికి కావాలంటె చూస్తున్న యాడనన్న దొరుకుతదోనని' అని అన్న.

"గట్ల నువ్వేం దొరుకవడ్తవోయ్, పిచ్చి పుల్లయ్యవు, నేనో తర్కీబ్‌చెప్త, అట్లచెయ్యి" అని అన్నడు.

"ఏందో చెప్పు మరి"

"గోషామహల్ స్టేడియమెనుక రంగమ్మని ఒకామె ఉంటది. ఆమెవని ఇండ్లు కిరాయిలకు చూపెట్టుడే. ఆమె తానికి వోయి రెండు రూపాయ లిస్తే నువ్వు కోరినసొంటి ఇల్లు చూపెడ్తది"

నాకు ఆపని మంచిగనిపించింది. ఇల్లిల్లు తిరిగి తిట్లూ, తన్నులు తింటానికంటే తెలిసినామెను పట్టుకొని ఇల్లు సంపాయించుడే మంచిదని ఆమె ఇంటి నంబరు రాసియ్యమన్న. ఆయన రాసిచ్చిండు.

నేనాయినకు శుక్రియా చెప్పి మల్ల గోశామహల్ దిక్కు తిరిగిన. ఆ ఇంటినంబర్‌కోసం సందులల్ల గొందులల్ల తిరిగీతిరిగీ ఆఖరుకు దొరకవట్టిన. కాని ఇంటికి తాళమేసుకుంది—ఒకవేళ ఎవ్వరికన్న ఇల్లు చూపెట్టటానికి పొయ్యుండొచ్చు, వస్తదికావొచ్చు అనుకొని ఆ ఇంటిముందట్నే నిలవడ్డ.

జర్రసేపటికి ఓవలుబైయేండ్లున్న ఒకామె వస్తూ "ఏంకావాలె నాయినా!" అనడిగింది.





## పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన దర్యాప్తుగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయుతేది, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామాయున్ను వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రమే వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైనపంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.

కల్ కెమికోవారి

# కాస్టొరాల్

*ముచ్చటగా జుట్టు ముడుచుకోడానికి*

కల్ కెమికో వారి కాస్టొరాల్ ను రాసు కొని ఆమె జుట్టును ముడుచుకుంటే, ఎంత అందంగా కనుపిస్తున్నదో చూడండి.

కాస్టొరాల్ అనన్య సామాన్యమైన గుణాలు ఆమెకు తెలుసు. ప్రకృతి సహజమైన సువాసనలీనే నూనెలు ఇందులో వున్నందున జుట్టు వొత్తుగా ఏపుగా పెరగడానికి ఇది దోహద మివ్వగలదు.




ది కలకత్తా కెమికల్ కంపెనీ లిమిటెడ్, కలకత్తా - 29

సౌత్ ఇండియా ఆఫీసు : 6/149, బ్రాడ్వే, మద్రాసు - 1.

CAS 1/61-62 TB

## ఇల్లు కిరాయికి

ఎర్రచీర, ఆకుపచ్చ రవికె తొడుక్కుంది. మొఖానికి స్నోలూ, పౌడర్లూ పూసింది. కండ్లకు సుర్మా పెట్టింది. కాళ్లకు హవాయిచెప్పులు తొడిగింది. పెదవులకు ఎర్రటిరంగు పూసుకుంది. నల్లగ, తెల్లగున్న తలవెంట్రుకలతోటి ఒదులుజడేసుకుంది. ఇంతకు ఈమె ఇండ్లు కిరాయికి చూపెట్టేటామెనా, లేక రంగసానా అన్న అనుమానమొచ్చింది.

"ఇల్లు కిరాయికి కావాల్నా, సాయినా!" అని అంది. ఎంత తియ్యగుంది ఆమె కంఠస్వరం అనిపించింది.

"రెండు రూములున్న ఒక భాగం కావాలె!"

"ఎన్నిరూపాయలలోపట్ల కావాలె!"

"ఓ ఇరువై — అయిదు, ముప్పైలోపట కావాలె."

"గంత తక్కువకు ఏడ దొరుకుతై సాయినా, ఈ పట్నంల"

"ఎట్లన్న కోశిశ్ చెయ్యి"

"సరే, కోశిస్ చేస్త రెండు రూపాయలియ్యి"

నేను జేబులకెలి రెండు రూపాయలు తీసిచ్చిన.

అప్పుడామె ఒక సందిలకు దారితీస్తూ నన్ను తనెనుక రమ్మన్నట్టు ఇశార (సైగ) చేసింది. నేను ఆమె వెనుకెనుకనే పోయిన. అట్ల మేము సందులూ, గొందులూ తిరిగితిరిగి ఒకబంగ్ల చేరుకున్నం ఆబంగ్ల చుట్టు కాంపౌండు లేదు. కాని అది బడేపెద్ద బంగ్ల! దాంట్ల లెక్కలేనన్ని కమ్రలున్నట్టు బైటికికనిపిస్తుంది. ఆ బంగ్లలున్న దర్వాజలన్నిటికి తాళాలేసునై.

ఆమె బంగ్లకాడికి పొయ్యి పెద్దదర్వాజ తాళం తీసి నన్ను రమ్మన్నది. నేనులోపటికి పోయిన. ఆమె ఎదురుంగున్న చిడీలు ఎక్కుకుంట మీదికిపోతుంటె ఆమెవెనుకనే నేను కూడా ఎక్కిన. అట్ల మీదికి పోంగనే ఎడమచెయ్యి దిక్కురెండు కమ్రలున్నపోర్షనొకటి కనిపించింది. ఆ కమ్రలల్ల నల్లంది. కరంటుంది. గోడలు తెల్లగనే ఉన్నై. కాని మొలలు కొట్టి పీకినట్లున్నందున పొక్కలు పడ్డై.

"ఎట్లుంది?" అనడిగిం దామె.

"మంచిగనే ఉంది" అన్న నేను.

"దీనికి ముప్పైరూపాయల కంటె ఒక్కపైస తక్కువకు కూడా ఇవ్వనన్నడు ఇంటాయిన," అని అంది.

"అది సరేగాని, ఈబంగ్లల మిగిలిన కమ్రలల్ల ఎవరు లేరుగదా!" అనడిగిన.

"ఇండ్లకు ఇంక వారందోజలకు ఒక దొరొచ్చేదుంది. ఆయిన ఈ మొత్తం బంగ్ల ఈరెండు రూములు తప్పిచ్చి నూటయాభై రూపాయలకు కిరాయికి తీసుకున్నడు." అని అంటూ, మాట బద్లాయించి "అయితేమరి ముప్పై రూపాయిలియ్యి. ఈరూములు మీకు ఖరారు చేపిస్త" అని అంది.

"ఆసంగతి మామామతోటి మాట్లాడు. నేమ పత్తిగ చూసి పోవుటాని కొచ్చిన"

"అట్లయితే ఈరూపాయలు మీకుదొరుకై. పెద్దగాల్లే ఒకాయిన వీటిని చూసిపైసలు తెస్తనని పోయిండు. ఇంక ఆదగంటలవచ్చి వీటిని ఖబ్జాచేసు కుంటడు. మీ యిద్దరిలల్ల ఎవ్వరు ముందు పైస లిస్తే వాల్లకే ఇప్పిస్త" అనిఅంది.

"అట్లని ఎరుకుంటే తెచ్చేటోన్నే. కాని ఎరుక లేదాయె. ఇప్పుడేం చెయ్యాల్నె, మరి" అని అన్న.

"అట్లంటే ఫాయిదలేదు. నీదగ్గర ఎంతుంటే అంతిచ్చి బయానకింద జమకట్టిస్తే పొద్మికేదాక దూస్త. అప్పుడు మిగిలినయి తెచ్చిస్తే మీకు క్రమా తాళపుచేతు లిప్పిస్త," నని అంది.

"మా మామ కరంటుబిల్లు, నీల్లబిల్లు కట్టుమ ఇచ్చిన పదిరూపాయలున్నై" అని అన్న

"అవినాకిచ్చి జల్ది ఇంటికిపొయ్యి మిగిలిన ఇరువై అడుక్కరా. నేను ఇంటాయిన తానికిపోయి ఈ రూపాయలు బయానకింద జమకట్టిస్త" నని అంది.

"సరే, నేనిప్పుడే పొయ్యి మామాను తీసు కొస్త. మరి నువ్వునాకు యాడ కలుస్తవ్?"

"మా యింటికిరా. బయానిచ్చొచ్చి ఇంట్లనే ఇంతెజార్ (నిరీక్షణ) లుంట," అని అంది.

నేను వెంటనే జేబులకేలి పదిరూపాయలు తీసిచ్చి మిగిలినయి తెస్తనని చెప్పి కిందికి దిగొచ్చిన.

నేను ఇల్లు చేరేవారకు మామ ఇంక పేపరు చదువుకుంటనే వరండల కూసొనిఉన్నడు. నన్ను చూడంగనే "ఏమైంది?" అని అడిగిండు.

"గోశామహల్ల ఒక పెద్దబంగ్లల రెండు కమ్రల పోర్షన్ చూసొచ్చిన. బయాన పదిరూపాయలిచ్చి మనకు ఖాయం చేపించిన" అని అన్న.

"శబ్బాష్, పుల్లయ్యా! మనిషంటే ఇట్లుం డాలె" అనిమెచ్చుకున్నడు.

నాకు చక్కలిగుంలగుల చేసినట్లైంది.

"మరి మనమిప్పుడే పోవాలె! లేకపోతే అయిల్లు మనకు దొరుకది. లేట్లైతే ఉంకోల్లకిచ్చేస్తదట"

"మరిప్పుడే పోదా మంటవా?"

"ఆ, ఇప్పుడే పోవాలె. ఆమె మనకోసం వేరే వాల్లను విడిచిపెట్టి ఇంతెజార్ చేస్తనన్నది.

"అయితే పా, మరి" అనుకుంటు మామలేచి లోపట్లకు పోయి కమీజు, కోటూ తొడుక్కొని బయటి కొచ్చిండు.

ఇద్దరం కలిసి సైకిల్ టొక్సి దాక నడుచుకుంట పోయి ఆడ వో సైకిల్ కిరాయికి తీసుకొని బయలు దేరినం.

మేము గోశామహల్ చేరుకునేవారకు ఒంటి గంటైంది. నేను మామను సక్కగ రంగమ్మింటికి తీసుకపోయి. ఇండిటికి తాళమేసిలేదు. కాని తలుపులు దగ్గరికేసున్నై.

నేను పేరు పెట్టి పిలిచిన.

ఒకామె బయటికొచ్చింది. కాని పొద్దుగాల నాకిల్లు చూపెట్టినామెకాదు. బహుశా ఆమెచెల్లె లైవచ్చునన్న.

"లోపట రంగమ్ముందా?" అనడిగినా నేను.

"రంగమ్మను నేనే బాబూ, నీం కావాలె? ఇల్లు కిరాయికి కావాల్నా?"

చచ్చినంఫో! అప్పుడేమో ఎర్రగ, బక్కగున్న రంగమ్మ, ఇప్పుడేమో కర్రెగ, దొడ్డుగైంది. ఈమె దగ్గరేమన్న మంతర్ జంతరున్నదా? లేకపోతే ఆమే, ఈమే వేరు, వేరా? నేను ఎటూ తెలువక పిచ్చోనైపోయిన.

మామనాదిక్కు ఆశ్చర్యంగ చూసుడు మొదలు పెట్టిండు.

నేను మామ నజర్కేలి తప్పించుకొని ఆమెతోటి "పొద్దుగాల ఈ ఇంట్లనే ఉండే ఉంకో ఆమె నాకు ఇల్లుచూపెట్టి పదిరూపాయలు బయాన తీసుకున్నది. మిగిలిన రూపాయలు తీసుకరమ్మని, ఈ ఇంట్లనే ఉంటనని చెప్పింది" అని అన్న ఏడ్పుమొఖం పెట్టుకొని.

ఆమె రెండు కంటిపాపలు మీది కెక్కచ్చి నన్ను కొండెంగను చూసినట్టు చూసుకుంటు ఆమె ఈ ఇంట్లనే ఉండంగ నువ్వు చూసినవా? ఈ ఇంటి తాళమేసే నీతోటివొచ్చిందా?" అని అడిగింది కుచ్చికుచ్చి మాట్లాడుకుంటూ.

"ఈ ఇంటికి తాళమేసుంటె, నేను నువెప్పుడు ఒస్తవోనని ఎదిరి చూసుకుంట నిల్చున్న. ఇంతట్లనే కుడిచెయ్యిదిక్కు సందిలకేలి ఆమెవొస్తు 'ఇల్లు కిరాయికి కావాల్నా' అనడిగింది. ఔనంటే నన్ను తనతోటి తీసుకపోయింది" అని అన్న లోపట ఎక్కెక్కి ఏడుస్తు.

"అట్లయితే ఆమె ఇంటికే పొయ్యి అడుగు. ఆమెనే అడుగు. నేను కాదుగదా, నీదగ్గర బయాన తీసుకున్నది" అని అంది.

అప్పుడు మామ నాతోటి "తెలిసింది కథంత" అని అంటూ దారితీసిండు ఇంటిదిక్కు. నేను ఆ కథేందో తెలువక మామను పీచాజేసిన (వెంబడించుట).

జర్రదూరం పోంగనే మామ చెప్పుడు షురువు చేసిండు.

"ఈ పట్నంల ధోకా బాజోల్లుంటరు. జర వాల్లను సమ్హాలించుకోవాలని ఇదువారకే చెప్పిన. మన మొకరికోసం చూస్తుంటె ఉంకోడు వాడే మనం చూసేమనిషన్నట్టు యాక్టింగ్చేసి పదో, ఇరువయో టోపేసి జౌతలవడ్తరు. అసొంటివాల్లే ఇంటికిరాయిలు చూపెట్టేటోల్లల్ల కొందరుంటరు. వాళ్లు ఖాళీగా, ఎక్కువ మనుషులు లేని జాగలల్ల ఉన్న ఇండ్ల మారుతశాలు సంపాయించి, ఇంటి కిరాయికోసం తిరిగెటోల్లను పట్టుకొని, వాళ్ళకు ఇల్లు ఇప్పించినట్టె నమ్మకం కలిగించి బగాయించ తరు. ఇచ్చిన రూపాయలందుకొని. అందుకని ఈ పట్నంల అడుగడుక్కు జాగర్తపడాలె!" అని చెప్పిండు మామ.

చూసింర్డా, చదివెటోల్లా హైదరాబాద్ల ఆడోల్లు కూడ ఎంత ధోక చేస్తరో! అందుకని ఈడ మీరు ముసలమ్మలనుగాని, నడివయసమ్మలనుగాని మరిచిపొయ్యిగూడ ఇల్లు కిరాయికి చూపెట్టు మని అడుగకుండ్రి. ఇక వుంటా. మల్ల పుర్స తున్నప్పుడు కల్సుకుందాం. ఖుదాహఫీస్!!! ★


పండిత
డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాను-17

డాక్టర్ వృత్తి చేయండి!
ఇంటిలో విరామంగా కూర్చొని వుండేప్పుడు, పోస్టల్ ట్యూషన్ ద్వారా, హోమియోపతి చదువుకొని, గవర్నమెంటు రిజిష్టర్డు కాలేజిద్వారా డిప్లొమా పొందండి. ప్రాస్పెక్టస్ ఉచితము.
వివరములకు వెంటనే వ్రాయండి.
INDIAN
HOMOEOPATHIC
COLLEGE
(APW) JULLUNDUR CITY

గృహములో వాడదగు సినిమా
ప్రొజెక్టరుకు ఆర్డరు యివ్వండి




ఆనందదాయకమైన వినోద కాలక్షేపం అద్భుతములు, సాహసములు మీఇంట్లోనే మా ప్రొజెక్టర్తో చూడవచ్చును. టార్చితో గాని లేక ఏ.సి/డి.సి ఎలెక్ట్రిసిటీతో పని చేయించవచ్చును. 35 ఎం. ఎం.ఫిలింవాడవచ్చు. సినిమావలె చిత్రములు తమంతటతామే వివిధ రంగులలో కదలుచుండను. ఖరీదు: రు 15/-; 40′ ఫిలిం & 4′×3′ స్క్రీను & ఇన్స్ట్రక్షన్ పుస్తకం ఉచితం. పోస్టేజిరు4-50 డీలక్స్ స్పెషల్ రు 25; 60′ ఫిలిం, స్క్రీను & ఇన్స్ట్రక్షన్ పుస్తకము ఉచితం. పోస్టేజి రు. 5/—పూర్తితృప్తి లేనిచో డబ్బు వాపసు. కొద్దిస్టాకు వున్నది. నేడే ఆర్డరు పంపండి.
HollywoodCinemaCorpn(Regd)
(WAM), 2194, Kalyanpura.
Delhi -6.